క్లుప్తంగా

మాకివలసలో భూముల పరిశీలన



బైదలాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధిలోని మాకివలస భూములను శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష సోమవారం పరిశీలించారు. వీటితోపాటు పక్క గ్రామాలైన బైదలాపురం, జెమినివలస తదితర గ్రామాల్లోని భూములు పరిశీలించి గిరిజనులతో మాట్లాడారు. ఈ భూములకు సంబంధించి గిరిజనులు, సత్యనారాయణ గుప్తకు వివాదం జరుగుతోంది. దీనిపై ఎస్టీ కమిషన్‌ను గిరిజనులు ఆశ్రయించారు. ఆర్డీఓ మాట్లాడుతూ పూర్తిస్థాయి పరిశీలన తరువాత జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నామన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఆర్ఐ కిరణ్ సిబ్బంది ఉన్నారు.

రేషన్ అందజేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ కార్డుదారులు

సారవకోట: మండల కేంద్రంలోని ఒకటో రేషన్ డిపో పరిధిలో ఈ నెలకు సంబంధించిన రేషన్ సరుకులు ఇప్పించాలని కార్డుదారులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ డిపో పరిధిలో ఉన్న సుమారు 300 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు నేటికీ అందించలేదన్నారు. దీని వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్, రగుతు రామారావు తదితరులు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ఉమాకామేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, సహస్ర నామార్చనలు, రుద్రాభిషేకాలు, హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. వేదపండితులు గంగవరపు వాసుదేవ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీలాదేవిపురం సర్పంచ్ మృతి



సిమ్మమ్మ (ఫైల్)

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) సర్పంచ్ జల్లు సిమ్మమ్మ సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె మూడు పర్యాయాలు సర్పంచ్ పదవి చేపట్టారు. ఈమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సిమ్మమ్మ మాజీ సర్పంచ్ జల్లు ఆదినారాయణకు అక్క. ఈమె మృతి పట్ల గ్రామస్తులు, మండల నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గల మధుకేశ్వరుడిని మాఘ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా సోమవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఊరేగించారు. తిరువిధిలో అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధుకేశ్వరుడిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు దర్శించుకున్నారు.

14న బల ప్రదర్శన పోటీలు

సారవకోట: మండలంలోని వడ్డినవలసలో ఈ నెల 14న జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్థానిక శ్రీనాథస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఇప్పిలి గణపతి రావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. దీంట్లో విసురుగుండు, తీత సంగిడి, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 13వ తేదీ సాయంత్రంలోగా ఫోన్ 9502382777 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పల్లెకు చేరని వెలుగు



పల్లె వెలుగు బస్సు

- పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజల అవస్థలు
- ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సరుబుజ్జిలి: పల్లె నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రజలు సౌకర్యవంతంగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పల్లె వెలుగు బస్సులు నేడు పూర్తిగా కానరావడంలేదు. చిన్న, చిన్న పల్లెలను కలిపి ప్రధాన పట్టణాలకు బస్సు సౌకర్యం ఉండడం వలన ప్రజల అవసరాలు గట్టెక్కేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పల్లె వెలుగు బస్సులు చాలా గ్రామాలకు వెళ్లని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి.

తగ్గిన సర్వీసులు..

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలంలో గతంలో 4 పల్లె వెలుగు సర్వీసులు నడిచేవి, ప్రస్తుతం 3 బస్సులే వస్తున్నాయి. ఆమదాలవలస మండలంలో 9 నుంచి 4, పొందూరు మండలంలో 8 నుంచి 5, బూర్జ మండలంలో 6 నుంచి 4 సర్వీసులకు తగ్గాయి. ఇవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. సమయపాలన సరిగా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పాడుతున్నారు.

ఈ పల్లెలకు బస్సులు దూరం...

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల పరిధిలోని దాదాపు 50 శాతం గ్రామాలను కలిపేలా గతంలో పల్లె వెలుగు బస్సులు నడిచేవి. దీని వలన ప్రజలు తమ ప్రయాణాలను సాఫీగా చేసేందుకు చాలా అనుకూలంగా ఉండేది. ప్రధాన రహదారికి సుదూరంగా ఉన్న సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, పెద్దసవలాపురం, పురుషోత్తపురం, అలమాజీపేట, ఇస్కలపాలెం, సుబ్బపేట, పెదమాలపేట, ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ, పాతూరు, కొత్తవలస, చీమలవలస, బూర్జ మండలంలోని గుత్తావల్లి, లాభాం, లంకాం, ఖండ్యాం, పొందూరు మండలంలోని పిల్లవలస, దల్లవలస గ్రామాలకు బస్సు సౌకర్యాలు పూర్తిగా లేవు.బస్సు సౌకర్యాలు పూర్తిగా లేకపోవడం వలన ఆయా గ్రామాలు ప్రజలు తమ అవసరాల కోసం ఆటోలను, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. భద్రతలేని ప్రయాణాలు చేసి ప్రమాదాలకు గురవుతున్నారు.



సరుబుజ్జిలి జంక్షన్ వద్ద ఆటోలో ప్రమాదకర ప్రయాణం

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామంలోకి గతంలో బస్సులు వచ్చేవి. ఆర్టీసీ అధికారులు ఆంక్యుపెన్సీ రేటు చూపి బస్సులు నిలిపేశారు. దీని వలన విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు లేక ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నాం.

– పైడి మోహన్‌రావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

బస్సులు రావడంలేదు



బస్సులు ఎక్కేందుకు ప్రయాణీకులు ఉన్నా.. ఆర్టీసీ అధికారులు నడిపేందుకు వెనుకంజ వేస్తున్నారు. దీనివలన ప్రధాన రహదారులకు సుదూరంగా ఉన్న గ్రామాల ప్రజలకు సరైన రవాణా సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు రూట్ సర్వే చేయాలి.

– బద్రి రామారావు, పెద్దసవళాపురం, సరుబుజ్జిలి మండలం

పరిశీలన చేస్తాం

పల్లె వెలుగు సర్వీసులు గతంలో నడిచిన గ్రామాల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తాం. తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శర్మ, ఆర్టీసీ డిపో–2 మేనేజర్, శ్రీకాకుళం

నాటుసారాను నిర్మూలిద్దాం



మామిడిగుడ్డిలో గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీ శ్రీకాంత్ రెడ్డి

మెళియాపుట్టి: నాటు సారా తయారీ, క్రయ, విక్రయాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో కుటుంబాలు నాసనం అవుతున్నాయని, నాటుసారాకు దూరంగా ఉండాలని డీసీ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మామిడిగుడ్డి గ్రామంలో సారా తయారీ నిర్మూలనలో భాగంగా నవోదయ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించి, గిరిజన ప్రజలకు అవగాన కల్పించారు. మామిడిగుడ్డి సారా తయారీలో మొదటిస్థానంలో ఉందని తెలుసుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సారా మహమ్మారికి దూరంగా ఉంటూ మీపై వచ్చిన మచ్చను తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఐలు, మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో అధిక శాతం సారా తయారీ చేస్తున్నారంటే.. భవిష్యత్ తరాలకు మీరిచ్చే సందేశం ఇదేనా అని ప్రశ్నించారు. నేటినుంచి సారాకు దూరంగా ఉండి మార్పుకు తొలి అడుగు వేయాలన్నారు. సారా తయారీ మానుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సి.హెచ్.తిరుపతినాయుడు, ఎక్సైజ్ సీఐలు మీరాసాహెబ్, గాయత్రి, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు, ఎస్ఐ రమేష్ బాబు, మాలతి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ పరీక్షల్లో రాణించాలని స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న ఎంపీపీ మెయిన్ పాఠశాల హెచ్‌ఎం పి.కృష్ణారావు అన్నారు. పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పోట్నూరు ప్రేమ్ ప్రథమ స్థానం సాధించారు. ప్రేమ్, పలువురు విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ప్రేమ్ తల్లిదండ్రులు భారత రమేష్, సుహాసిని మహాపాత్రోను ఉపాధ్యాయులు, రామరాజు సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో స్థానం కల్పించాలి



చౌదరి లక్ష్మీనారాయణ

సారవకోట: గిరిజనులకు చట్ట సభల్లో స్థానం కల్పించాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం ఆయన సారవకోటలో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ ఎమ్మెల్యే స్థానం మాత్రమే ఎస్టీకి కేటాయించారన్నారు. జిల్లాల విభజన తరువాత ఏర్పడిన శ్రీకాకుళం జిల్లాలో ఎస్టీల తరపున చట్ట సభలకు వెళ్లే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఇస్తున్న ఎమ్మెల్సీ స్థానాన్ని గిరిజనులకు కేటాయించి చట్ట సభకు పంపించాలని కోరారు.

బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు



మాల్‌లో తనిఖీలు చేస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది, పోలీసులు

పాతపట్నం: బాలలను పనిలో పెడితే సంబంధిత యాజమానులపై కేసులు నమోదు చేస్తామని చైల్డ్‌లైన్ అధికారి వై.ఎస్.కైలేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లలో చైల్డ్‌లైన్, పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి సోమవారం తనిఖీలు చేశారు. దువ్వారివీధి సమీపంలోని ఓ దుకాణం వద్ద రాజస్తాన్‌కు చెందిన బాలుడుని గుర్తించారు. సంబంధిత యాజమానికి జరిమానా విధించారు. బ్రెడ్స్ చైల్డ్‌లైన్ సిబ్బంది జగన్, కానిస్టేబుల్ రామకృష్ణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పొందూరు రూరల్: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో పొందూరు మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. పొందూరు మండలం అంగన్‌వాడీ సిబ్బంది నాయకురాలు లోలుగు జ్యోతి నాయకత్వంలో పొందూరు, లోలుగు, కింతలి సెక్టార్ల సిబ్బంది కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు రమణమ్మ, కృష్ణవేణి, నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులందరికీ ఉపాధి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి మార్చి ఆఖరు నాటికి వంద రోజులు పనులు కల్పించటమే లక్ష్యంగా పెట్టుకోవాలని సిబ్బందికి ఏపీఓ వి.శ్రీదేవి సూచించారు. తన కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 11 గంటల మధ్యలో, సాయంత్రం 4 గంటల తరువాత పనులు చేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేయించే బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బంది, మేట్లపైన ఉందన్నారు. దినసరి వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలన్నారు. ఇంకుడు గంతల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. సాంకేతికి సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



ఖండాపు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అత్త లంక అమ్మడమ్మ ఇటీవల మృతి చెందారు. గోవిందరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెలరేగిన మంటలు



పాత పోలీసు స్టేషన్ ఆవరణలో వ్యాపించిన మంటలు

నరసన్నపేట: మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. పోలీసు స్టేషన్, సీఐ క్వార్టర్, సీఐ కార్యాలయం సమీపంలో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ఏఎస్ఐ సింహాచలం, హెచ్‌సీ దాలినాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అదుపుచేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎండిన చెట్లు, ఆకుల కారణంగా మంటలు రేగి వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలో నేరడి రెవెన్యూ గ్రామ పరిధి మెట్టూరు సమీపంలో ఉన్న 76 సెంట్లు డీ పట్టా (ప్రభుత్వ భూమిని) ఆక్రమణకు గురైందని టెక్కలి ఆర్డీఓకు మండలంలోని అడవికొత్తూరు గ్రామానికి చెందిన యుక్కా రాంబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. డీ పట్టాను కొంత మంది ఇళ్ల పట్టాలుగా కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల కొనుగోలుపై విచారణ చేపట్టి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

పాతపట్నంలో 12న జాబ్ మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్–ఎంటర్ ప్రైస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా 12న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో సంక్యు ఇండియా, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయని, సంక్యు ఇండియా కంపెనీ ప్యాకింగ్ – హెల్పర్స్ (65 ఖాళీలు) ఉద్యోగాలకు 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18–40 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుందని చెప్పారు. జీతం నెలకు రూ.12,000 ఉంటుందన్నారు. డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ట్రైనీ కెమిస్ట్ (50 ఖాళీలు) ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ విద్యార్హత కలిగిన 18–27 సంవత్సరాల వయస్సు గల పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీతం రూ.17వేలు వరకు వస్తుందన్నారు. ఈ ఉద్యోగ మేళా 12న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నంలో జరుగుతుందని, అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7989744612 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో..
కూటమి ప్రభుత్వం చెలగాటం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకూ పోరాటం చేస్తాం
- యువత పోరుకు తరలిరండి
- ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, చింతాడ రవికుమార్ పిలుపు

నరసన్నపేట: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నయవంచన పాలన చేస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ నిలదీయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. సోమవారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం వద్ద యువత పోరు పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 12న పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత పోరుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే పార్కు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌కు రూ.4.600 కోట్ల బకాయి ఉంటే బడ్జెట్లో రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వైఎస్సార్ తీసుకువచ్చిన ఈ పథకంతో పేద కుటుంబాలకు చెందినవారు ఎంతోమంది డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని గుర్తుచేశారు. 2014–19 మధ్య ఈ పథకాన్ని టీడీపీ నీరుగార్చిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పథకం 2019–24 వరకు సక్రమంగా అమలైందన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి పాలనలో పాతరోజులే పునరావృతం అవుతున్నాయన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆందోళన చేస్తుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ముద్దాడ బైరాగినాయుడు, నక్క తులసీదాస్, వరుదు వంశీకృష్ణ, చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, దండి జయప్రకాశ్, కనపల శేఖరరావు, కణుసు సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పాతపట్నం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ యువత పోరు పోరాటానికి సిద్ధమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సోమవారం పాతపట్నంలోని తన కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ దొర సావిత్రి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి.సురేష్, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, కోల్ల కృష్ణారావు, పాతపట్నం మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మీసాల రామకృష్ణ, పోలాకి జయమునిరావు, గండివలస ఆనందరావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎం.తాతయ్య, నాయకులు సవర రమేష్, అలికాన మాధవరావు, సవర సుభాష్, కర్ణం శోభూషణరావు, జి.యోగి, పనుకు మోహన్, వెలమల బాలరాజు, వెంకటరమణ, వి.చిన్నారావు, శ్యామ్యూల్, వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ


ఆమదాలవలస: విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన కింద విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని జగనన్న ప్రజా సేవ కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతాకుమారి, సాధు కామేశ్వరరావు, దుంపల శ్యామలరావు, పార్టీ నాయకురాలు బొడ్డేపల్లి పద్మజ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, బి.వి.రమణమూర్తి, కూన రామకృష్ణ, చిన్నారావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా..



కొత్తూరు మండలం నివగాం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది. రోడ్డు పైనే చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చెత్తను తొలగించాలని, మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. – కొత్తూరు

ఆశాజనకంగా..



జలుమూరు మండల కేంద్రంతోపాటు కోన సింహాద్రిపేట, పాగోడు, వెలుసోద, కరవంజ, గుగ్గిలి, నగిరికటకం, అచ్చుతాపురం తదితర గ్రామాల్లో రబీ వరి పంట ఆశాజనకంగా ఉంది. వరినాట్లు వేసి 45 రోజులు కావడంతో చిరుపొట్ట దాటింది. వాతావరణం సహకరిస్తే మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 1,500 ఎకరాల్లో వరి పంట సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. – జలుమూరు

సంక్షిప్తంగా..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హిరమండలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సారవకోట అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణుల సంరక్షణ అనేది సామాజిక బాధ్యత అన్నారు. వన్యప్రాణాలను చంపడం, వేటాడడం నేరమన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతానికి విద్యార్థులకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అటవీశాఖ బీట్ అధికారి ఎం.అజయ్ ఉన్నారు.

ఆర్థికసాయం

మెళియాపుట్టి: మండలంలోని బంజీరు గ్రామానికి చెందిన గూడ మార్కండేయులు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందారు. మృతుని భార్య హేమలతకు ఉపాధి వేతనదారులు రూ.6 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బి.సింహాచలం, వేతనదారులు, మేట్లు ఉన్నారు.

బయోమెట్రిక్ త్వరగా పూర్తిచేయాలి

పొందూరు: ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అథంటికేషన్ రెండు రోజుల్లో పూర్తిచేయాలని మండల ఎంఈఓ గట్టు శ్రీరాములు సోమవారం తెలిపారు. తొలుత సంబంధిత పాఠశాలల్లో విద్యార్థి ఆధార్ నంబర్‌ను వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. వెంటనే ఆధార్ అథంటికేషన్ ఎంత మంది పెండింగ్ ఉన్నారో తెలుస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థులను సమీప సచివాలయం, మీ–సేవా కేంద్రాన్ని సంప్రదించేలా చేసి అథంటికేషన్ పూర్తిచేయించాలన్నారు. వివరాలకు క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్‌ను సంప్రదించాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) వంశధార పునరావాస కాలనీలో గల కోదండ రామాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం కన్నుల పండగలా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.